ప్రజాశక్తి

ఆదివారం 28 సెప్టెంబర్ 2025

నేటి నుంచి జిందాల్ నిర్వాసితుల నిరాహార దీక్ష

ప్రజాశక్తి- శృంగవరపు కోట

తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కొద్దిరోజులుగా బొడ్డవరలో ఆదివారం నుంచి నిరాహార దీక్షలు చేపడతామని జిందాల్ నిర్వాసితులు తెలిపారు. శనివారం బొడ్డవరలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంపెనీ తమను మోసం చేసినా అధికారులు తమకు అండగా నిలబడతారని ఆశించామని, కానీ అధికారులు స్పందిచకపోవడం విచారకరమని అన్నారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాల అయినా తమ హక్కుల కోసం, న్యాయం కోసం నెలల తరబడి నిరసన చేస్తున్నా అధికారుల నుండి స్పందన రాకపోవడం బాధాకరమన్నారు. రైతులకు అండగా నిలబడాల్సిన వారు బడా సంస్థల తరపున నిలబడటం సరికాదన్నారు. తమ భూములు తమకే సొంతం అని, జిందాల్‌కి ఇవ్వమంటూ నినాదాలు చేశారు. న్యాయం కోసం ఎన్ని రోజులైనా పోరాడుతామని హెచ్చరించారు.

ఇ-క్రాప్‌కు ఇంకెన్ని రోజులు?

- 50శాతం కూడా దాటని నమోదు
- రైతులను వెంటాడుతున్న కష్టాలు
- సమన్వయంతో సమస్యలు
- ఆందోళనలో అన్నదాతలు
- అక్టోబర్ 15 వరకు గడువు పెంపు

పంట నష్టపరిహారం, పంటల బీమా, పంట రుణాలు, సున్నా వడ్డీ, కనీస మద్దతు ధర... ఇలా వ్యవసాయ పథకాల రాయితీలు ప్రభుత్వం నుంచి రైతులు పొందాలంటే ఇ క్రాప్ నమోదు కీలకం. ఈ ప్రక్రియ జిల్లాలో నత్తనడకన సాగుతోంది. వ్యవసాయ, రెవిన్యూ శాఖల మధ్య సమన్వయం లోపంతో ఈ క్రాప్ లక్ష్యాన్ని చేరుకోలేక పోతుంది. ఇంకా నమోదుకు 18 రోజులు మాత్రమే గడువు, వాస్తవానికి గడువు ముగిసిపోతున్నప్పటికీ ప్రభుత్వం ఆ గడువును అక్టోబర్ 15వ తేదీ వరకు పొడిగించింది. ఆ లోపు నమోదు పూర్తి కాకపోతే రైతులు అన్ని విధాలా నష్ట పోవాల్సిన దుస్థితి దాపురించనుంది.

ప్రజాశక్తి, విజయనగరం కోట

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నాలుగు నెలలు అవుతుంది. మరో 30 రోజుల్లో సీజన్ ముగుస్తుంది. ఇప్పటికే భారీ వర్షాలతో కొన్ని పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. మరోవైపు ముందస్తు సాగుచేసిన పంటలు పలు ప్రాంతాల్లో కోతకు వస్తున్నాయి. అయినా రైతులకు అన్ని విధాలుగా ఉపయోగపడే ఇ- క్రాప్ నమోదుపై నీలి నీడలో కొమ్ముకున్నాయి. ఇప్పటివరకు జిల్లాలో ఈ క్రాప్ 50శాతం కూడా దాటలేదు. దీంతో ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. పంట నమోదు కాకపోవడంతో విపత్తుల సమయంలో పరిహారం, పంట అమ్మకాల సమయంలో ఇబ్బందులు తప్పవని రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటతో సంబంధం లేకుండా ప్రతి ఎకరా భూమిని సర్వే నంబర్ల ఆధారంగా వివరాలు కచ్చితంగా నమోదు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లా వ్యాప్తంగా 3,64,570 ఎకరాల్లో పంటలు సాగు కాగా, ఈ సీజన్ ఖరీఫ్‌లో ఇప్పటివరకు 1,79,000 ఎకరాల మాత్రమే పంట నమోదు పూర్తయింది. 1,85,570 ఎకరాలు అంటే సగానికి పైగా ఇ క్రాప్ నమోదు కావలసి ఉంది. వాస్తవంగా అయితే ఈ నెల ఆఖరికి నమోదు పూర్తి కావాల్సి ఉండగా ప్రభుత్వం మరో 15 రోజులు గడువు పొడిగించింది. దీంతో వ్యవసాయశాఖ సిబ్బంది లక్ష్యాన్ని చేరుకునేందుకు మల్లగుల్లాలు పడుతుండగా గడువులోపు పంట నమోదు కాకుంటే తమ పరిస్థితి ఏమిటని రైతుల ఆందోళన చెందుతున్నారు.

శాఖల మధ్య సమన్వయ లోపం

పంటల నమోదు రెవెన్యూ, వ్యవసాయ శాఖలు సంయుక్తంగా పూర్తి చేయాల్సి ఉంది. రైతులతో కలిసి పంట పొలాలకు వెళ్లి అక్కడ సాగులో ఉన్న పంట వివరాలు, ఆన్‌లైన్‌లో నమోదు చేసి పూర్తిగా ధ్రువీకరణ చేసిన తరువాత ఇ-క్రాప్ పూర్తి చేయాలి. కానీ రెండు శాఖల మధ్య సమన్వయం లోపించింది. రెవెన్యూ సిబ్బంది ఈ ప్రక్రియకు దూరంగా ఉంటుందన్నారు రైతులు. వివిఎలకు రైతుల భూములపై అవగాహన అంతగా లేకపోవడం, విఆర్ఒలు సహకరించకపోవడంతో ఇ క్రాప్ మందకొడిగా సాగుతుందని తెలుస్తుంది. దీనికి తోడు వివిఎ బదిలీల నేపథ్యంలో చాలా మంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్కడక్కడా కొందరు వ్యవసాయ సిబ్బంది మాత్రమే ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

నిర్లక్ష్యం తీరిది..

మారిన నిబంధనల ప్రకారం ఈసారి

పంట	విస్తీర్ణం (ఎకరాలు)	పూర్తయినది	చేయాల్సింది
వరి	2.30లక్షల	1.39,532	96,468
మొక్కజొన్న	24,000	6300	17,700
పత్తి	4800	2600	2200
చెరకు	5600	1400	4200

వారిగా జియో మ్యాపింగ్ చేసి, ఫోటో తీసి అప్లోడ్ చేయాలి. ఈ తతంగం క్షేత్రస్థాయిలో పూర్తి కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. సాంకేతిక సమస్యలతో ముందుకు సాగడం లేదు. యూరియా కోసం రైతులు పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తుండడంతో పంపిణీ చేసేందుకు సిబ్బంది అక్కడే ఉండడంతో పంట నమోదుపై దృష్టి పెట్టలేకపోతున్నారు.. భూములు సర్వే జరిగిన గ్రామాల్లో ఎల్ పి నెంబర్లకు వ్యవసాయ శాఖ సిబ్బంది దగ్గరున్న సర్వే నెంబర్లకు సరిపోకపోవడంతో సమస్య ఎదురవుతుంది. బయోమెట్రిక్ పడని రైతులకు ఐరిస్ చేయడానికి సిగ్నల్స్ సమస్య సాంకేతిక సమస్య సిబ్బందిని వేధిస్తుంది. వెబ్‌ల్యాండ్ నుంచి ప్రభుత్వ భూమి లేదా అభ్యంతరకర సర్వే ఖాతా నెంబర్లు డౌన్‌లోడ్ అయితే వ్యవసాయేతర భూమిగా పరిగణించి నమోదు చేయాల్సి ఉంది. వెబ్ లాండ్, అటవీ భూముల్లో పంటలు ఉన్న లేకపోయినా ఫీల్డ్ సర్వే చేయాలి.

నేటి నుంచి అఖిల భారత డ్వాక్రా బజార్

- 244 స్టాళ్లతో ప్రముఖ ఉత్పత్తుల ప్రదర్శన
- 8 రోజుల పాటు నిర్వహణ
- సరస్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-విజయనగరంకోట

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం, దసరా వేడుకలు, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక మాన్సాస్ గ్రౌండ్‌లో ఈనెల 28 నుంచి అక్టోబరు 8వరకు అఖిల భారత డ్వాక్రా బజార్ (సరస్)ను నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్‌రెడ్డి తెలిపారు. శనివారం తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ స్వయం సహాయక సంఘాలు తాము రూపొందించే పేరెన్నికగన్న ఉత్పత్తుల ప్రదర్శనకు అఖిల భారత డ్వాక్రా బజార్ (సరస్) గొప్ప వేదికగా నిలవనుందని తెలిపారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి, తద్వారా వారు ఆర్థికంగా ఎదిగేందుకు సహకరించే ఉద్దేశంతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 244 స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నామని, ఈ స్టాల్స్‌లో దేశంలో పేరుపొందిన డ్వాక్రా మహిళా సంఘాలు తయారు చేస్తున్న దేశీయంగా, అంతర్జాతీయంగా పేరుపొందిన హస్తకళలు, కలంకారీ, చేనేత ఉత్పత్తులు, వెదురు ఉత్పత్తులు, ఆర్టిఫిషియల్ నగలు, డ్రైఫ్రూట్స్, వివిధ రకాల తినుబండారాలు, పచ్చళ్లు, జ్యూట్‌బోర్డు ఉత్పత్తులు, నాబార్డ్, తెలంగాణా రాష్ట్ర ఉత్పత్తులైన పోచంపల్లి, గద్వాల్ వస్త్రాలు ఈ ప్రదర్శనలో ఉంచి విక్రయిస్తారని తెలిపారు. మన రాష్ట్రం నుంచి 26 జిల్లాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంత స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం నిర్వహణకు కేంద్ర ప్రభుత్వంతో పాటుగా నాబార్డ్, యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా, స్త్రీనిధి, సిజిజిబి, ఎపిజివిబి, మెప్మా ఆర్‌వైఎస్ఎస్, యుఐఐసి, ఎస్‌బిఐ, డిసిసిబి, కెనరా బ్యాంకు, పిఎన్‌బి, బిఒబి, బిఒఐ, మాన్సాస్ ఆర్థిక సహాయంతో ఈ సరస్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సెర్ప్, డిఆర్‌డిఎ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ సరస్‌కు నగరపాలక సంస్థ, పోలీస్, వైద్యారోగ్యశాఖ, విపత్తుల నివారణాశాఖ, విద్యుత్ శాఖ, విద్యాశాఖ, ఐసిడిఎస్, సమాచార పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు అందిస్తున్నాయని తెలిపారు. సరస్‌లో భాగంగా ఈనెల 29 నుంచి అక్టోబరు 7 వరకు ప్రతిరోజూ వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. విజయనగరం ఉత్సవాల్లో భాగంగా గత ఏడాదిలాగే ఇదే ప్రదేశం వద్ద పుష్ప ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎగ్జిబిషన్ ను ఉచితంగా సందర్శించవచ్చునని, వివిధ రకాల ఆహార పదార్థాలతో ఫుడ్ కోర్టును కూడా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. విలేకర్ల సమావేశంలో డిఆర్‌డిఎ పీడీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాంసుందర్‌రెడ్డి

అమృత్ భారత్ ట్రైన్ ప్రారంభం

విజయనగరంకోట : ప్రధానమంత్రి మోడీ బరంపురం నుంచి సూరత్‌కు అమృతభారత్ ట్రైన్‌ను వర్చువల్‌లో ప్రారంభించి జాతికి అంకితం చేశారు. ఈ రైలు విజయనగరం స్టేషన్‌కు చేరుకోవడంతో పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, రైల్వే ఎడిఆర్ఎం మనోజ్‌కుమార్ సాహూ, సీనియర్ డివిజనల్ ఇంజినీర్ సాయిరాజ్, బిజెపి జిల్లా అధ్యక్షులు ఉప్పలపాటి రాజేష్‌వర్మ జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ముందుగా బరంపురం నుంచి వచ్చిన ఈ రైలును వీక్షించి ఇక్కడి నుంచి సూరత్ బయలుదేరిన ట్రైన్‌కు జండా ఊపి ప్రారంభించారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత

శాశ్వత లోక్ అదాలత్‌ను వినియోగించుకోండి

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

శాశ్వత లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బబిత కోరారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం శాశ్వత ప్రజా న్యాయ పీఠంపై న్యాయ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ శాశ్వత లోక్‌అదాలత్ సేవలను కక్షిదారులంతా వినియోగించుకోవాలన్నారు. బీమా రంగ సేవలు, బ్యాంకింగ్, ఆర్థిక సంస్థల సేవలు, విద్యాసంస్థలకు సంబంధించిన తగాదాలు, నివాసం, వాస్తవ ఆస్తికి సంబంధించిన సేవలు, ఉపాధి హామీ తగాదాలు, రవాణా, పోస్టల్ టెలిఫోన్ టెలిగ్రాఫ్ సేవలకు సంబంధినవి వీటి పరిధిలోకి వస్తాయని తెలిపారు. వీటన్నిటికీ సంబంధించిన తగాదాలను రాజీమార్గం ద్వారా గాని లేదా తుది తీర్పు ద్వారా పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ దుర్గయ్య, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి ఎ.కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

పండగలో ప్లాస్టిక్ నిషేధాన్ని పాటించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి-కంటోన్మెంట్

విజయనగరం ఉత్సవాలు, పైడితల్లి అమ్మవారి పండగ నేపథ్యంలో నగరంలో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని అధికారులకు ఆర్‌డిఒ డి.కీర్తి సూచించారు. వచ్చే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ఏర్పాట్లను చేసుకోవాలని తెలిపారు. శనిరం తన ఛాంబర్ లో పలు శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. అధికారులంతా సమన్వయం తో పని చేసి అమ్మవారి ఉత్సవాలను ప్రశాంతంగా జరిగేలా చూడాలని తెలిపారు. గుడి లోపల దేవస్థానం సిబ్బంది ఎక్కువ మంది ఉండడంతో భక్తుల తోపులాట జరుగుతోందని, లోపల తక్కువ మంది సిబ్బంది ఉండేలా చూడాలని దేవస్థానం సిబ్బందికి సూచించారు. విఐపి దర్శనాలను ఒక్క నిమిషంలో చేయాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ కోసం షిఫ్ట్ లలో సిబ్బందిని వేయాలన్నారు. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో పాత భవనాల యజమానులకు నోటీసు లు జారీ చేసి ఆ భవనాలపై మనుషులు లేకుండా చూడాలని తెలిపారు. అత్యవసర వైద్య వాహనాలను 24/7 ఏర్పాటు చేయాలని తెలిపారు. సమావేశం లో డిఎస్‌పి ఆర్. గోవిందరావు, తహశీల్దార్ కూర్మనాథ్, డిసిహెచ్ఎస్ పద్మశ్రీ రాణి , పోలీస్, దేవస్థానం సిబ్బంది, ఆర్అండ్‌బి, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

గురజాడ విద్యార్థుల పతిభ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

"సుపథ" స్వచ్ఛంద సేవా సంఘం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీలలో గురజాడ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. బహుమతులు పొందిన వారిలో కె.సాయేషా, వి.లలితకుమార్, కె.మోక్షిత్‌దొర, ఎల్.మారుతి మీరజ్, ఎస్.కృష్ణ సాయి, ఎస్. హర్షవర్ధన్, కె.హాసిన్, పి.లలిత్ కుమార్, ఎ.కేతన, ఎ.అనురాధ, జివిఎల్ కామేశ్వరి, డి.వైష్ణవి ఉన్నారు. వీరిని స్కూల్ డైరెక్టర్ డాక్టర్ ఎం వి ఆర్ కృష్ణాజి, కరస్పాండెంట్ స్వరూప, హెచ్ఎం పూడి శేఖర్, ఈవెంట్ ఇన్చార్జ్ స్వాతి అభినందించారు.

ఎస్‌పిని కలిసిన అవుట్ సోర్సింగ్ జెఎసి నాయకులు

కంటోన్మెంట్ : జిల్లా ఎస్‌పి ఎఆర్. దామోదర్‌ను జిల్లా ఔట్ సోర్సింగ్స్ ఎంప్లాయిస్ జెఎసి జిల్లాశాఖ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా శాఖ అధ్యక్షులు గండిపిల్లి మహేంద్ర బాబు ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి పల్లికల శ్రీనుతో పాటు ఇతర జెఎసి నాయకులు ఎస్‌పిని కలసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కమిటీ నాయకులు, ప్రధాన కార్యదర్శి, ట్రెజరర్ విజయలక్ష్మి, జి.అరుణ, జిల్లా కమిటీ సభ్యులు, మీడియా కోఆర్డినేటర్ అశోక్ కుమార్, జిల్లా ట్రెజరర్ పి. రామ్ గోపాల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు కేటాయించండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- శృంగవరపుకోట

నియోజకవర్గం అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి ముఖ్యమంత్రి చంద్రబాబును శనివారం అమరావతిలో కోరారు. ఈ మేరకు ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. వినతిని చదివిన చంద్రబాబు నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలపై సానుకూలంగా స్పందించారని త్వరలోనే నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయిస్తాను అని చెప్పారని ఎమ్మెల్యే తెలిపారు.

మిమ్స్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

- యాజమాన్యం వేధింపులే కారణం
- బాధ్యులను శిక్షించాలని, బదిలీలు.. వేధింపులు ఆపాలని సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నెల్లిమర్ల వద్దగల మిమ్స్ వైద్య కళాశాలలో ఆయాగా పనిచేస్తున్న యడ్ల గౌరి శనివారం కళాశాల గేటు వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. తన ఆత్మహత్యాయత్నానికి మిమ్స్ యాజమాన్యం వేధింపులే కారణమని ఘటనకు ముందు ఆమె వాయిస్ మెసేజ్‌ను ఉద్యోగులందరికీ పంపింది. ఉద్యోగులు తెలిపిన వివరాలు ప్రకారం..మండలంలోని కొండగుంపాం గ్రామానికి చెందిన యడ్లగౌరి 2003 నుంచి మిమ్స్‌లో ఆయాగా పనిచేస్తున్నది. ఉద్యోగుల సమస్యలపై జరిగే పోరాటాల్లో చురుగ్గా ఉండేది. దీంతో కోవిడ్ కాలంలో మిమ్స్ నుంచి విజయనగరం పోస్టాఫీసు దగ్గరలో గల మిమ్స్ అర్బన్ హెల్త్ సెంటర్‌కు బదిలీ చేసారు. ఇక్కడ తన విధులను సక్రమంగా నిర్వహించు కుంటుండగా ఈనెల 24న గౌరిని మిమ్స్ కు పిలిచి బొబ్బిలి బదిలీ చేశామని, రేపటి నుంచే బొబ్బిలిలో జాయిన్ కావాలని హెచ్ఆర్ శ్రీనివాస్ ఆదేశించారు. బొబ్బిలి బదిలీ చేసినట్లుగా శుక్రవారం కొండగుంపాంలో ఉన్న తన ఇంటికి పోస్ట్ ద్వారా కాగితాలు పంపించారు. కానీ 25న ఎప్పటి లాగే విజయనగరం అర్బన్ హెల్త్ సెంటర్‌కు గౌరి డ్యూటీకి వెళ్లగా డ్యూటీ ఇక్కడ లేదని పేర్కొంటూ ముందు రోజునే తంబ్ ఆపేసారు. సెలవు అడిగితే బొబ్బిలిలో జాయిన్ అయ్యాకే సెలవు అడగమని చెప్పారు. ఇలా యాజమాన్యం ఇబ్బందులకు గురి చేయడంతో ఉద్యోగం పోతుందనే ఆందోళన చెంది శనివారం ఉదయం మిమ్స్ గేటు వద్ద గౌరి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. వెంటనే ఆ చుట్టు పక్కల ఉన్న తోటి ఉద్యోగులు వైద్యం కోసం మిమ్స్‌లో జాయిన్ చేసారు. ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి సీరియస్ గా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం విజయనగరం తిరుమల మెడికవర్ ఆస్పత్రికి పంపించారు. ప్రస్తుతం ఆమె ఐసియులో చికిత్స పొందుతోంది.

ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గౌరి

యాజమాన్యంపై చర్య తీసుకోవాలి : సిఐటియు

ఆయా గౌరి ఆత్మహత్యాయత్నానికి కారణమైన మిమ్స్ యాజమాన్యంపై చట్ట రీత్యా చర్య తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ డిమాండ్ చేశారు. సంస్థ అభివృద్ధికి కష్టపడుతున్న ఉద్యోగులపై నిరంతరం వేధించటం దుర్మార్గమని పేర్కొన్నారు. నాలుగు నెలల క్రితం డ్రైవర్ సూర్యనారాయణను సస్పెండ్‌చేసి తిరిగి డ్యూటీలో పెట్టుకోకపోవడంతో నెల్లిమర్ల బ్రిడ్జి దిగువన రైల్వే లైనుపై ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఆఘటన మరవక ముందే ఈ ఘటన జరిగిందన్నారు. హెచ్ ఆర్ శ్రీనివాస్ తో పాటు ఇందుకు బాధ్యులైన వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని, అక్రమ బదిలీలు, వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు.

సందడిగా దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం కోట

దసరా ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక గాజుల రేగ నారాయణ పబ్లిక్ స్కూలు విద్యార్థులు శనివారం ఘనంగా ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థులంతా దసరా బాణాలు పట్టుకొని ఇంటింటికీ వెళ్లి అలనాటి దసరా పాటలు పాడుతూ అందరినీ అలరించారు. 'ఏ దయా మీ దయ మా మీద లేదు' అంటూ పాటలు పాడారు. ఈ సందర్భంగా కరెస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ 30ఏళ్ల క్రితం నాటి దసరా పండగ ఏ విధంగా జరిగేదో ఆ విధంగా ఈనాడు విద్యార్థులతో నిర్వహించినటు తెలిపారు. ఇంటింటికీ వెళ్లి పాటలు పాడుతూ పిల్లలకు వచ్చిన డబ్బులతో విద్యార్థులకు పప్పు బెల్లాలు కొనిపెట్టి ఇవ్వడం ద్వారా వారికి పౌష్టికాహారం బాగా అందేదన్నారు. పిల్లల్లో మానసిక ఉల్లాసం పెరిగి చదువుపై శ్రద్ధ పెరిగి సమాజంలో ఉన్నతమైన విద్యార్థులుగా తయారయ్యేవారని తెలిపారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి ఎఆర్ దామోదర్

నిందితులకు శిక్ష పడేలా చర్యలు : ఎస్‌పి

ప్రజాశక్తి- కంటోన్మెంట్

వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో నిందితులకు న్యాయస్థానాల్లో శిక్షపడేలా చేయడంలో కోర్టు కానిస్టేబుళ్ళు, కోర్టు మోనటరింగు స్టాఫ్ పాత్ర క్రియాశీలకమని ఎస్‌పి ఎఆర్ దామోదర్ అన్నారు. పోలీసు అధికారులు, కోర్టు కానిస్టేబుళ్ళు, కోర్టు మోనటరింగు అధికారులు, హెచ్‌సిలు, కానిస్టేబుళ్లతో శనివారం జూమ్ సమావేశం నిర్వహించి వారు నిర్వహించాల్సిన విధులు, న్యాయస్థానాల్లో వ్యవహరించాల్సిన తీరు గురించి దిశా నిర్దేశం చేసారు. న్యాయస్థానాలు, పోలీసు స్టేషన్ల మధ్య కోర్టు కానిస్టేబుళ్ళు, సిఎంఎస్ అధికారులు వారధిగా పని చేయాలన్నారు. కేసుల విచారణ సమయంలో నిందితులపై నేరారోపణలు రుజువు చేసేందుకు సాక్షులు సకాలంలో హాజరయ్యేందుకు సమన్లను సకాలంలో అమలు చేయాలని, కోర్టులు జారీ చేసిన నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేసి, నిందితులు కోర్టు వాయిదాలకు రెగ్యులర్‌గా హాజరయ్యే విధంగా చూడాలని ఎస్‌పి తెలిపారు. కేసుల విచారణ మరింత వేగవంతంగా జరిపించేందుకు ఈ-సమన్స్ అమలు చేయాలన్నారు. కోర్టు విచారణ జరిగే సమయాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది బాధితులకు అండగా నిలవాలని, న్యాయస్థానంలో వారు సాక్ష్యం చెప్పే విధంగా బ్రీఫింగు చేయాలన్నారు. సంబంధిత న్యాయస్థానాలు రిమార్కు చేసిన అభియోగ పత్రాలను వెంటనే సరిదిద్ది, తిరిగి 2 అభియోగ పత్రాలను దాఖలు చేయాలన్నారు. మహిళలపై జరిగే దాడులు, పోక్సో, గంజాయి కేసుల్లో నిందితులకు కఠినంగా శిక్షింపబడేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. గ్రేవ్ కేసుల్లో ప్రాసిక్యూషను షెడ్యూలు విడుదలైన వెంటనే నిందితులకు శిక్షింపబడేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. దర్యాప్తు చేపడుతున్న సమయంలోనే నిందితులకు శిక్షపడేలా దర్యాప్తు అధికారులు సాంకేతిక ఆధారాలను సేకరించాలన్నారు.ఎఎస్‌పి సౌమ్యలత, పలువురు పోలీసుఅధికారులు పాల్గొన్నారు.

కార్మికుల కొనసాగింపునకు మీనమేషాలెందుకు?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

దశాబ్దాలు తరబడి పనిచేస్తున్న కార్మికులను కొనసాగించేందుకు కంపెనీ యాజమాన్యం మీనమేషాలు లెక్కిస్తుండగా, శ్రమ జీవులకు ఆసరగా నిలబడాల్సిన ప్రభుత్వం, అందులోనూ కార్మిక శాఖ తమకు పట్టనట్టుగా వ్యవహరిస్తున్నాయి. దీన్నిబట్టి పాలకపక్షం ఎవరి ప్రయోజనం కోసం పనిచేస్తుందో వేరేగా చెప్పనక్కర్లేదని బాధిత కుటుంబాలతోపాటు కార్మికవర్గం, ఆ వర్గానికి నాయకత్వం వహిస్తున్న సిఐటియు వ్యాఖ్యానిస్తోంది. గరివిడి వద్దగల ఆర్‌బిఎస్ఎస్ఎఫ్ఎన్ అండ్ దాస్ కంపెనీలో గరివిడి, గుర్ల, చీపురుపల్లి మండలాలకు చెందిన 503మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరంతా గరివిడి మండలం దేవాడ, సదానందపురం మైన్స్ పరిధిలో 10ఏళ్ల నుంచి 35ఏళ్ల వరకు రెక్కల కష్టం చేసుకుని, తమ కుటుంబాలను నెట్టుకొస్తున్నవారే. దేవాడ మైన్స్ లీజు ఒప్పంద కాలపరిమితి ఈ ఏడాది జనవరి 23న, సదానందపురం మైన్స్ లీజు సెప్టెంబర్ 14తో పూర్తి అయ్యింది. ఇది యాజమాన్యం చెబుతున్నమాట. ఈనేపథ్యంలో ఈ రెండు చోట్ల పనిచేస్తున్న కార్మికులను విధులనుంచి తొలగించి, సర్వీసు సెటిల్ మెంట్ చేస్తామంటూ యాజమాన్యం కార్మికులకు నోటీసులు జారీ చేసింది. సరే.... యాజమాన్యానికే పని లేనప్పుడు కార్మికులకు పనులు ఎలా కల్పిస్తారని అనుకోవచ్చు. అలా అనుకుంటే పొరపాటే. లీజు పూర్తయినప్పటికీ కొత్త మైన్స్‌కు మళ్లీ టెండర్లలో యాజమాన్యం పాల్గొనేందుకు ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో తమకు సర్వీసు సెటిల్ చేయవలసిన అవసరం లేదని, ఒకవేళ ఈ యాజమాన్యానికి టెండర్లు రాకపోతే, ఈ విషయం మాట్లాడుతామని కార్మికులంతా సిఐటియు నాయకత్వంలో ఖరాఖండిగా చెబుతునే ఉన్నారు. అయినప్పటికీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోంది. ఓవైపు మైన్స్ లీజుల పునరుద్ధరణకు ప్రయత్నిస్తూనే, ఇంకోవైపు కార్మికులను ఇంటికి సాగనంపడానికి బరితెగిస్తోంది. సర్వీసు సెటిల్ మెంట్ చేయటానికి ప్రయత్నించడాన్ని నిరసిస్తూ కార్మికులంతా కొన్ని నెలలుగా అనేక రూపాల్లో నిరసన తెలియజేస్తునే ఉన్నారు. కంపెనీ యాజమాన్యం, మండల తహశీల్దార్ మొదలుకుని జిల్లా కలెక్టర్, ఎంఎస్ఎంఇ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత వరకు వినతి పత్రాలు అందజేసినా ఇప్పటికి వరకు ఫలితం దక్కలేదు. కార్మికులకు ఇచ్చిన నోటీసులపై సిఐటియు చూపిన చొరవ మేరకు న్యూఢిల్లీ సెంట్రల్ లేబర్ కమిషనర్ వారి కార్యాలయంలో ఒకసారి, వర్చువల్‌గా మూడుసార్లు గత నెల రోజులుగా చర్చలు జరిగాయి. అక్కడ కూడా కార్మికులకు న్యాయం చూపే విధంగా ఫలితాలు రాలేదు. దీంతో, యాజమాన్య వైఖరిపైనా, ప్రభుత్వ నిర్లక్ష్యంపైనా కార్మికులు తమ నిరసన కొనసాగిస్తున్నారు. డిఎఫ్ఎన్ వద్ద నిరసన దీక్ష కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మికులపై యాజమాన్యం, ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును జనం తప్పుపడుతున్నారు.

గడువులోగా పనులు పూర్తి చేయాలి : కమిషనర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పైడితల్లమ్మ జాతర నేపథ్యంలో నిర్దేశించిన పనులన్నీ నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని సిబ్బందికి నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. శనివారం రామా రాయుడు రోడ్డు ప్రాంతంలో పర్యటించి పెద్ద చెరువు చుట్టూ చేపడుతున్న సుందరీకరణ పనులను పర్యవేక్షించారు. ప్రధాన జంక్షన్ల వద్ద చేపట్టబోయే విద్యుదీకరణ, ఇతర అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. పాక్షిక మరమ్మతు పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. అనంతరం అన్న క్యాంటీన్ పరిశీలించి అక్కడ పరిస్థితులను గమనించారు. ఇఇ ప్రసాద్, డిఇలు, శ్రీనివాసరావు, రత్నాకర్, ఎఇలు సుధాకర్, సూరి నాయుడు, పారిశుధ్య పర్యవేక్షకులు సాలెం రాజు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ నల్లనయ్య

జిఎస్‌టి తగ్గింపుతో ప్రజలకు లాభం

కేంద్ర ప్రభుత్వం తగ్గించిన జిఎస్‌టిలో మార్పుల వల్ల వివిధ వర్గాల ప్రజలకు లాభం చేకూరుతుందనినగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో రిసోర్సు పర్సన్స్, విఆర్ఒలు, సచివాలయ కార్యదర్శులను ఉద్దేశించి మాట్లాడారు. సూపర్ జిఎస్‌టి, సూపర్ సేవింగ్స్ పేరిట ఈనెల 25 నుంచి అక్టోబర్ 19వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. టిపిఆర్ఒ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు పాల్గొన్నారు.

30లోగా ఆస్తి పన్ను చెల్లించండి

నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న ఆస్తి పన్ను బకాయిదారులు 2025-26 మొదటి అర్ధ సంవత్సరం ఈనెల 30తో ముగుస్తున్నందున పన్ను చెల్లించాలని కమిషనర్ నల్లనయ్య కోరారు. ఆస్తిపన్ను బకాయిదారులకు అదనంగా వడ్డీ పడుతున్నందున, ఆస్తిపన్ను, కుళాయి ఛార్జీలు, ఖాళీ స్థలాల పన్ను చెల్లించాలన్నారు.

బాబోయ్ ఆ సచివాలయానికో దండం

◆ అక్కడ ఉద్యోగం చేయలేం ◆ బెంబేలెత్తిపోతున్న ఉద్యోగులు ◆ సెలవులపై వెళ్లిపోతున్న వైనం ◆ మోదవలస సచివాలయం ఉద్యోగుల పరిస్థితి

ప్రజాశక్తి- డెంకాడ

డెంకాడ మండలం విజయనగరానికి కూతవేటు దూరంలో ఉంది. ఇక్కడ ఉద్యోగం చేయడానికి ఉద్యోగస్తులు పోటీపడి మరి ఈ మండలానికి వస్తుంటారు. విజయనగరంలో నివాసముంటూ దగ్గరిలో ఉన్న డెంకాడ మండలంలో పనిచేయడానికి చాలా మంది ఇష్టపడుతుంటారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడకు రావడానికి బదిలీల సమయంలో రాజకీయ నాయకుల చుట్టూ, ఉన్నతాధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసి వారికి కొంత నగదు ముట్టజెప్పి ఇక్కడ ఉద్యోగం వేయించుకుంటారు. ఇంత డిమాండ్ ఉన్న ఈ మండలంలోని మోదవలస సచివాలయానికి వెళ్లమంటే మాత్రం ఉద్యోగులు వెనుకడుగు వేస్తున్నారు. అక్కడకు వెళ్లడానికి ఏ ఉద్యోగి ముందుకు రావడం లేదు. ఒకవేళ ఆ సచివాలయానికి వెళ్లినా అక్కడ పరిస్థితులను చూసి బదిలీ చేయించుకోవడం, లేకపోతే సెలవు పెట్టడం, అదీ కుదరకపోతే డిప్యూటేషన్‌పై వేరే చోటకి వెళ్లడమో చేసుకుంటారు. ఆ సచివాలయంలో పనిచేయడం కష్టమని ఆ సచివాలయ పరిధిలో ఉన్న గ్రామస్తులు నిత్యం ఫిర్యాదులు చేయడం ఉద్యోగస్తులను హింసించడం పనిచేయకపోతే సిబ్బందిని దుర్భాసలాడటం చేస్తుంటారని ఉద్యోగులు అంటుంటారు. అందుకే ఆ సచివాలయానికి ఎవరూ ఉద్యోగం నిమిత్తం వెళ్లడానికి ఇష్టపడటం లేదు. సిబ్బందిపై నిత్యం ఉన్నతాధికారులకు ఫిర్యాదులు చేస్తుంటారని అందుకే ఆ సచివాలయానికి వెళ్లడం లేదని అక్కడికి వెళ్లి ఉద్యోగం చేసే బదులు వేరొక చోటకి వెళ్లి ఉద్యోగం చేసుకుంటే మంచిదని సచివాలయ సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారు. ఒకవేళ ఎక్కడా ఖాళీ లేక ఆ గ్రామంలో ఉద్యోగం వచ్చినా చాలా మంది సిబ్బంది ఉద్యోగంలో చేరి వేధింపులు తట్టుకోలేక సెలవు పెట్టేస్తున్నారు. మరి కొంత మంది అసలు ఉద్యోగంలోనే జాయిన్ కావడం లేదు. దీంతో ఆ సచివాలయం ఇంఛార్జిలతోనే నడుస్తుంది తప్ప పర్మినెంట్ ఉద్యోగులు ఉండటం లేదు. గ్రామస్తులంతా కాకపోయినా కొంత మంది పని గట్టుకుని ఉద్యోగులపై అనవసరపు ఫిర్యాదులు చేయడంతో ఆ గ్రామానికి వెళ్లేందుకు ఉద్యోగులు వెనుకడుగు వేస్తున్నట్లు తెలిస్తోంది. వారికి నచ్చినట్లు పనిచేయకపోతే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులు కూడా పెట్టి బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో మనకెందుకులే ఆ తలనొప్పి అని చాలా మంది ఉద్యోగులు మోదవలస సచివాలయం అంటేనే భయపడిపోతున్నారు. ఇప్పటికైనా గ్రామస్తులు పనిచేసే వారితో పని చేయించుకొని పనిచేయుని వారిపై ఫిర్యాదులు చేస్తే బాగుంటుందని ఉద్యోగస్తులు వాపోతున్నారు.

ఉద్యోగులు లేకపోవడంతో బోసిపోయిన సచివాలయం

9 మందికి 4గురే..

ఈ సచివాలయంలో మొత్తం 9మంది ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి ఉంది. వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీస్, పశువైద్యాధికారి మొత్తం నలుగురు సచివాలయంలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఇంఛార్జి పంచాయతీ కార్యదర్శి ద్వారా సచివాలయాన్ని నడిపిస్తున్నారు. డిజిటల్ అసిస్టెంట్ 40 రోజుల నుంచి విధులకు హాజరు కాలేదు, విఆర్ఒ కూడా ఇంఛార్జి ద్వారా నడుపుతున్నారు. సర్వేయర్ ఇంఛార్జి కానీ గత నాలుగు నెలల నుంచి విధులకు రాలేదు. ఏఎన్ఎం ప్రస్తుతం సెలవులో ఉన్నారు. ఈ ఐదుగురు అక్కడ పనిచేయలేక వివిధ కారణాలతో ఆగిపోయారు. ప్రస్తుతం పని చేస్తున్న వారు కూడా పూర్తిగా ఉద్యోగ విధులు నిర్వహిస్తారని నమ్మకం లేదు. పనిచేస్తున్న నలుగురిలో ఎవరు ఉద్యోగానికి వస్తారో ఎవరు సెలవులు పెడతారో తెలియని పరిస్థితి. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఆ సచివాలయంలో పూర్తిస్థాయిలో సిబ్బందిని నియమిస్తారో ఎప్పటిలానే ఏదో కొంతమంది సిబ్బందితో అలా నడిపిస్తారో చూడాలి.

మంచి భవిష్యత్తుపై దృష్టి సారించాలి

నెల్లిమర్ల: సారిపల్లి యువత మంచి భవిష్యత్తు పై దృష్టి సారించాలని ఎస్ఐ బి.గణేష్ సూచించారు. శనివారం ఆయన సారిపల్లి గ్రామంలో పెద్దలు, యువతతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెడు వ్యసనాలకు లోను కాకుండా సమాజాన్ని తీర్చిదిద్దడంలో యువత కీలక పాత్ర పోషించాలన్నారు. అనంతరం సైబర్ నేరాలు, మహిళలు వేధింపులు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

నేడు ఎఎంసి చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం

నెల్లిమర్ల: పూసపాటిరేగ ఎఎంసి చైర్‌పర్సన్‌గా గేదెల గాయత్రి ఆదివారం ప్రమాణ స్వీకారం చేస్తున్నట్టు టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు తెలిపారు. శనివారం ఆయన టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌తో కలిసి ప్రమాణ స్వీకారం అనంతరం ఏర్పాటు చేసిన సభా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పూసపాటి రేగలో జరుగుతున్న ప్రమాణ స్వీకారానికి కూటమి నాయకులు, అభిమానులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

వీణల తయారీ కళాకారులను ఆదుకోవాలి

బొబ్బిలి: బొబ్బిలి వీణల తయారీ కళాకారులను ఆదుకోవాలని చేనేత, జౌళిశాఖ మంత్రి సవితను ఎమ్మెల్యే బేబీనాయన కోరారు. అమరావతిలో శనివారం మంత్రిని కలిసి వీణల కార్మికుల సమస్యలను వివరించారు. ప్రపంచంలోనే బొబ్బిలి వీణలకు మంచి గుర్తింపు తెచ్చేలా వాటిని తయారు చేస్తున్న కార్మికులను ఆదుకోవాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారు.

అధికారుల సమక్షంలో యూరియా పంపిణీ

రేగిడి: మండలంలోని కొర్లవలస గ్రామంలో తహశీల్దార్ ఐ. కృష్ణలత, ఎస్ఐ బాలకృష్ణ ఆధ్వర్యంలో శనివారం వ్యవసాయాధికారులు యూరియా పంపిణీ చేశారు. యూరియా పక్కదారి పట్టకుండా అధికారుల సమక్షంలో పంపిణీ చేయడంతో రైతులకు సక్రమంగా అందడంతో ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలు గ్రామాల్లో యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడు తున్న విషయం తెలుసుకున్న అధికారులు పగడ్బందీగా యూరియా పంపిణీ చేస్తున్నారు. గ్రామాల్లో యూరియా బయోమెట్రిక్ విధానం ద్వారా పంపిణీ చేస్తున్నట్టు ఎ. శ్రీనివాస రావు తెలిపారు. వీరితో ఆర్ఐ కోట గిరి ఉన్నారు.

లేగ దూడల సంరక్షణపై ప్రదర్శన

రేగిడి: మండలంలోని బాలకావిలవస గ్రామంలో శనివారం పాడి రైతులు ఏర్పాటు చేసిన లేగ దూడల సంరక్షణ ప్రదర్శన పలువురిని ఆకట్టుకుంది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా పశుఅభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లేగ దూడల ప్రదర్శన చేపట్టారు. ఈ ప్రదర్శనలో ఒక నెల నుంచి 6 నెలల లోపు దూడలను సమృద్ధిగా సంరక్షించిన వారికి బహుమతులు అందజేశారు. ఇఒ సిహెచ్ సత్యప్రకాష్, ఎడి జయప్రకాష్, రాము మాట్లాడుతూ లేగ దూడలు పరిపుష్టిగా పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారులు దుర్గాప్రసాద్, రాము పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం

నెల్లిమర్ల: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో శనివారం ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీపై సమన్వయ సమావేశం నిర్వహించారు. మండలంలో 19వ విడత సామాజిక తనిఖీలో భాగంగా నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఎపి సుదర్శన్ మాట్లాడుతూ గ్రామాల్లో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ వచ్చే నెల 15వరకు జరుగుతుందన్నారు. ఆయా పంచాయతీల్లో జరిగిన పనులు పరిశీలించి తనిఖీలు చేపట్టనున్నారు. తనిఖీలో పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సోషల్ ఆడిట్ డిఆర్‌పిలు క్షేత్ర స్థాయిలో ఆడిట్ చేసి ప్రజావేదిక నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఎపిఒ రామారావు, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా పోషకాహార స్టాల్

గజపతినగరం: మండలంలోని సీతారాంపురం గ్రామంలో సచివాలయం వద్ద శనివారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 8వ రాష్ట్రీయ పోషణ మాసంలో భాగంగా ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారి ఎం.రాజేశ్వరి ఆదేశాల మేరకు సూపర్‌వైజర్ జానకి పర్యవేక్షణలో అంగన్వాడీ కార్యకర్తలు శ్రీదేవి, పైడిరాజు కలిసి సమకూర్చిన పోషకాహార స్టాల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆకు కూరలు, పప్పులు, కూరగాయలతో ఉన్న ఈ స్టాల్ చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

దళితులపై సిఐ దాడి దారుణం

నెల్లిమర్ల: బాపట్లలో దళితులపై సిఐ దాడి చేసి కొట్టడం దారుణమని జైభీంరావు భారత్ పార్టీ నాయకులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావు, చిన్నం అరుణ్ కుమార్ అన్నారు. శనివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ బాపట్ల జిల్లా మార్టూరు డేగర మూడికి చెందిన దళిత యువకులు అల్లాడి ప్రమోద్ కుమార్, జ్యోతి పాతులూరి పై సిఐ క్రమశిక్షణ పేరిట పోలీస్ స్టేషన్‌కి పిలిపించి వారిపై దాడి చేసి తీవ్రంగా కొట్టడం దారుణమన్నారు. దళిత యువకులతో తెల్ల కాగితం మీద సంతకం తీసుకొని ఎక్కడైనా చెబితే ఇదే గతి పడుతుందని సిఐ హెచ్చరించడం దుర్మార్గమన్నారు. దళితులకు న్యాయం చేయాల్సిన పోలీసులు దళితుల మీద దాడికి పాల్పడడం అన్యాయమన్నారు. దళిత యువకుల మీద దాడి చేసి కొట్టినవారిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

రక్తదాన శిబిరానికి స్పందన

బాడంగి: స్థానిక సిహెచ్‌సిలో శనివారం ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని సూపరింటెండెంట్ పి.నాగేశ్వరరావు ప్రారంభించారు. రక్త నిల్వలు పెంచేందుకు రక్తదాన శిబిరం నిర్వహించినట్లు వైద్యులు చెప్పారు. రక్తదాన శిబిరంలో రామభద్రపురం ఎస్ఐ వెలమల ప్రసాద్, సాగర్ బాబు, కానిస్టేబుల్స్, జర్నలిస్టులు, విద్యార్థులు, యువకులు పాల్గొని రక్తదానం చేశారు.

విద్యార్థులకు ఎక్సలెన్స్ అవార్డులు

శృంగవరపుకోట: స్వచ్ఛంద సంస్థ విశాఖ ట్రావెల్ అండ్ టూరిజం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం వేడుకలలో సర్వేపల్లి విద్యానికేతన్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎక్సెలెన్స్ అండ్ బ్రాండ్ ట్రిగ్గర్ అవార్డులు దక్కాయని పాఠశాల ప్రిన్సిపాల్ పి.పైడి రాజు శనివారం తెలిపారు. 6, 8 తరగతులు చదువుతున్న బొబ్బిలి లాస్య శ్రీ, బొబ్బిలి హృషీకేశ్‌లకు వందకు పైగా మొక్కలు నాటే కార్యక్రమాల్లో పాల్గొని వేలాది మొక్కలు నాటి నందుకు, యోగాలో చక్కని ప్రతిభ చూపిస్తున్నందుకు ఈ అవార్డులను విశాఖపట్నం దస్పల్లా నివేదిక సభా ప్రాంగణంలో అందించారన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సి.హెచ్.సన్యాసిరావు, డైరెక్టర్ వి.సుశీల ఉపాధ్యాయులు చిన్నారులను అభినందించారు.

ఉపాధి నిధులతో రియల్ ఎస్టేట్‌కు రోడ్డు

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని సింగరాయి, చందలూరు గ్రామాలకు మధ్య ఉన్న సింగరాయి రెవెన్యూ పరిధిలో ఏఎన్ఆర్ రియల్ ఎస్టేట్‌లోకి వెళ్లేందుకు ఉపాధి హామీ నిధులతో రోడ్డు పనులను శరవేగంగా చేపడుతున్నారు. ఇక్కడ చందులూరు ఎల్‌కోట మండలం కాగా, సింగరాయి వేపాడ మండలం. రోడ్డు వేస్తున్నది సింగరాయి రెవెన్యూలో కావడంతో ఉపాధి నిధులతో రోడ్డు పనులు ఎలా చేపడుతున్నారని ఎపిఒ ఆదిలక్ష్మిని వివరణ కోరగా తనకు తెలియదని చెప్పడం కొసమెరుపు. అయితే సింగరాయి ఊరిలోకి రోడ్డు వేస్తున్నామని చెప్పి రియల్ ఎస్టేట్‌లోకి రోడ్డు వేయడం ఎంతవరకు సమంజసమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

రియల్ ఎస్టేట్‌కు వేస్తున్న రోడ్డు

కోనేరులో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బొబ్బిలి

మండలంలోని దిబ్బగుడివలస గ్రామానికి చెందిన భవానీ మాలలో ఉన్న మడి సాయిసతీష్ (24) ప్రమాదవశాత్తు కొనేరులో పడి మృతి చెందినట్లు ఎఎస్ఐ కొండలరావు చెప్పారు. దిబ్బగుడివలసకు చెందిన సాయిసతీష్ శనివారం భోజనానికి వెళ్లేందుకు కొనేరులో స్నానానికి వెళ్లాడు. ఈత రాకపోవడంతో ప్రమాదవశాత్తు కాలు జారీ కొనేరులో పడిపోవడంతో నీటిలో మునిగిపోయారు. ఈ సమయంలో రక్షించమని కేకలు వేయగా పొలంలో ఉన్నవారు బయటకు తీశారు. కోన ఊపిరితో ఉన్న సాయిసతీష్‌ను ఆటోలో ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారణ చేశారు. తండ్రి అచ్యుతరావు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ తెలిపారు.

కుష్టు రహిత సమాజాన్ని ఏర్పాటు చేద్దాం

జిల్లా కుష్టు నివారణ అధికారి రాణి

ప్రజాశక్తి- రేగిడి

కుష్టు వ్యాధి రహిత సమాజాన్ని ఏర్పాటు చేసుకుందామని అందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జిల్లా, కుష్టు, టిబి, ఎయిడ్స్ నివారణ అధికారి డాక్టర్ రాణి అన్నారు. శనివారం బూరాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ముందుగా సిబ్బంది పనితీరును అడిగి తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్న శిర్లాం గ్రామాన్ని సందర్శించి అక్కడ అంగన్వాడి, పాఠశాలల విద్యార్థులను ఆరోగ్య పరీక్షలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలతో కుష్టు వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించాలని వైద్య సిబ్బందికి సూచించారు. కుష్టురహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. స్పర్శలేని మచ్చ ఉన్నట్లయితే అశ్రద్ధ చేయకుండా దగ్గర్లో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి తనిఖీలు చేసుకోవాలన్నారు. గ్రామంలో అందిస్తున్న వైద్య సేవల గూర్చి ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో డిఎన్ఎమ్ఒ అర్చనాదేవి, వైద్యాధికారి రీనా చౌదరి, పిఎంఒ అప్పలస్వామి, టెక్నికల్ ఆఫీసర్ శివరామకృష్ణ, డిపిఎమ్ఒ వెంకటేశ్వరరావు, హెల్త్ ఇఒ రాధాకృష్ణ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలికను పరిశీలిస్తున్న జిల్లా కుష్టు నివారణ అధికారి రాణి

పెట్రోల్ బంక్ ప్రారంభం

ప్రజాశక్తి- బాడంగి

మండలంలోని కామన్నవలస గ్రామ పరిధిలో స్థానికంగా వాహనదారుల అవసరాలను తీర్చడానికి కొత్తగా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను మాజీ ఎమ్మెల్యే, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన ఇంధనం అందించడం చాలా ముఖ్యమైన సేవ అని అన్నారు. ఈ పెట్రోల్ బంక్ స్థానిక వాహనదారులకి సౌకర్యం కల్పించడంతో పాటు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వం అనేక ఇంధన విధానాలు, పర్యావరణహిత ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని, భవిష్యత్‌లో ఎలక్ట్రిక్ వాహనాలు, గ్రీన్ ఎనర్జీకి ప్రాధాన్యం పెరుగుతున్నందున పెట్రోల్ బంకులు కూడా ఆ దిశగా మార్పులు తెచ్చుకోవాలని సూచించారు. ఈ ప్రాంతంలో ఇంత వరకూ సరైన సౌకర్యం లేక ఇంధనం కోసం దూరప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేదని ఇప్పుడు ఈ పెట్రోల్ బంక్ ప్రారంభం కావడం సంతోషకరమని అన్నారు. కొత్తగా ప్రారంభమైన ఈ పెట్రోల్ బంక్‌లో పెట్రోల్, డీజిల్, లూబ్రికెంట్స్‌తో పాటు డిజిటల్ చెల్లింపుల సౌకర్యం కూడా కల్పించామని స్థానికులు వినియోగించుకోవాలని ఎంపిటిసి పాలవలస గౌరీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యాపారవేత్తలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న తెంటు రాజా, పాలవలస గౌరు

బాలకృష్ణ దిష్టిబొమ్మ దహనం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో శనివారం వైసిపి మండల అధ్యక్షులు ఎం.జగ్గుబాబు ఆధ్వర్యంలో సినీ హిరో హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ దిష్టి బొమ్మను దహనం చేశారు. అసెంబ్లీ వేదికగా మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి, సినీ నటుడు మెగాస్టార్ చిరంజీవిపై బాలకృష్ణ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆయన దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జగ్గుబాబు మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. నిండు సభలో పరుష పదజాలంతో మాట్లాడటం సిగ్గుచేటని బేషరుతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎన్ వెంకట్రావు, జగ్గయ్యపేట ఉపసర్పంచ్ వంటాకు శ్రీను, వావిలిపాడు సీనియర్ నాయకుడు బీల సతీష్, ఆతవ సర్పంచ్ గొంప వేమన నాయుడు, ఎంపిటిసి టివి రమణ, ఎన్ శ్రీను, బి.శ్రీను, జ్యోతి ప్రకాష్, డి.అప్పారావు, మెలిపాక రమణ, గండి శ్రీరాములనాయుడు తదితరులు పాల్గొన్నారు.

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి

బొబ్బిలి: అసెంబ్లీ సాక్షిగా మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి వ్యంగంగా మాట్లాడిన బాలకృష్ణ వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని చిరు బొబ్బిలి టౌన్ వైడ్ మెగా ఫ్యామిలీ అధ్యక్షులు లంక రమేష్ డిమాండ్ చేశారు. శనివారం అభిమానులతో కలిసి ఆయన మాట్లాడుతూ బాలకృష్ణ కుటుంబం తీవ్ర వేధింపులకు గురై, జైలు పాలైనప్పుడు అండగా నిలిచింది, ఆయన కుటుంబం అధికారంలోకి రావడానికి అహర్నిశలూ కృషి చేసింది మెగా కుటుంబమే అన్న విజ్ఞత మరిచి, అధికార మదం తలకెక్కించుకున్న బాలకృష్ణ చట్టసభల్లో చిరంజీవి ప్రతిష్టను దిగజార్చే విధంగా మాట్లాడటం సిగ్గు చేటన్నారు.

వేపాడ: దిష్టి బొమ్మను దహనం చేస్తున్న వైసిపి నాయకులు

మహిళలు పౌష్టికాహారం తీసుకోవాలి

ప్రజాశక్తి- గుర్ల

ప్రతి మహిళ మంచి పౌష్టికాహారం తీసుకోవాలని గుర్ల మెడికల్ ఆఫీసర్ శ్రీధర్, హోమి యోపతి డాక్టర్ వెంకట మధు అన్నారు. వల్లాపురం గ్రామంలో శనివారం స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్తలు, మహిళలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుర్ల: మాట్లాడుతున డాక్టర్ శ్రీధర్

వేపాడ: బొద్దాం పిహెచ్‌సి పరిధిలోని వసి గ్రామంలో స్వస్త్ నారీ స్వశక్తి పరివార్ అభియోగ్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రమా దేవి ఆద్వర్యంలో శనివారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 141 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఒబ్బిన పార్వతి, గ్రామ పెద్దలు కారుకొండ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

స్పందించారు.. వైద్యం అందించారు

శృంగవరపుకోట: స్వస్త్‌నారీ స్వశక్తి పరివార్ అభియాన్‌కు నోచని గిరిజనులు అనే ప్రజాశక్తిలో వెలువడిన వార్తకు స్పందించిన వైద్యాధికారులు శనివారం మండలంలోని పల్లపు దుంగాడ గ్రామంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ప్రజాశక్తి వార్తతో గిరిశిఖర గ్రామాలలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందని ప్రతి గిరిజన గ్రామానికి వైద్య సదుపాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు, గిరిజన నాయకులు కోరారు.

సహ చట్టంపై అవగాహన

ప్రజాశక్తి- గంట్యాడ

ప్రతి ఒక్కరూ సమాచార హక్కు చట్టాన్ని వినియోగించుకోవాలని ఎఒ బి.శ్యామ్‌కుమార్ అన్నారు మండలంలోని రావివలస, రామవరం, లక్కిడాం గ్రామాలలో శనివారం సహచట్టంపై అవగాహన సదస్సులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ చట్టం వల్ల ప్రతి ఒక్కరూ కోరుకున్న సమాచారాన్ని సంబంధిత శాఖ నుండి ఉచితంగా పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో రావివలస గ్రామ పెద్దలు సత్యనారాయణ, వ్యవసాయ శాఖ సిబ్బంది సునీల్ కుమార్, వేణుబాబు, గోపి రైతులు పాల్గొన్నారు.

వంగర: సమాచార హక్కు చట్టంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఎఒ తట్టికోట కన్నబాబు అన్నారు. మండలంలోని కొప్పర కొత్తవలస గ్రామంలో ఆయన శనివారం పర్యటించి రైతులకు, వ్యవసాయ శాఖ సిబ్బందికి సహచట్టంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సత్య కళాశాలలో ఫ్రెషర్స్‌డే వేడుకలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

స్థానిక తోటపాలెం లో గల సత్య డిగ్రీ, పీజీ కళాశాలలో ఫ్రెషర్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని అతిథులు అందరూ కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ప్రధాన అతిథిగా హాజరైన సెంచూరియన్ యూని వర్సిటీ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి ఎస్ ఎన్ రాజు గారు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఈ కాలేజీ లో ప్రతి విద్యార్థి తన ప్రతిభను చాటుకోవడానికి అవకాశాలు ఉన్నందున, వాటిని అందిపుచ్చుకొని వ్యక్తిత్వాన్ని, నాయకత్వ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. మరో ముఖ్య అదితి కల్నల్ గోపేంద్ర మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాన్ని పెట్టుకొని ముందుకు సాగాలని కోరారు. కళాశాల కరెస్పాండెంట్ డాక్టర్ బొత్స ఝాన్సీలక్ష్మీ మాట్లాడుతూ కళాశాలను ఉన్నత స్థాయి విద్యను అతి తక్కువ ఫీజు లతో అందించేందుకు ప్రారంభించామని పేర్కొన్నారు. విద్యార్థులు కూడా అనేకమైన ప్రభుత్వ ఉద్యోగాల లో స్థిరపడ్డారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి మాట్లాడుతూ, ఫ్రెషర్స్ డే అనేది కొత్త విద్యార్థులను స్వాగతించడం మాత్రమే కాదు, వారిలో సృజనాత్మకత, క్రీడా సాంస్కృతిక నైపుణ్యాలను ప్రోత్సహించే ఒక ముఖ్యమైన వేదిక అన్నారు. ఈ దశలో విద్యార్థులు సీనియర్స్ తో మైత్రి ఏర్పరుచుకొని, కొత్త స్నేహాలను నిర్మించు కోవాలని పేర్కొన్నారు. కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం.శశి భూషణరావు మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థులు వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు అందరినీ అలరించారు.

వేడుకలను ప్రారంభిస్తున్న సెంచూరియన్ ఛాన్సలర్

ఎంఎస్ఎంఇ పార్కులపై గ్రామసభ నిర్వహించాలి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జిందాల్ కర్మాగారం కోసం తీసుకున్న భూములలో ఎంఎస్ఎమ్ఇ పార్క్‌ల ఏర్పాటుపై గ్రామ సభలు నిర్వహించాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మూలబొడ్డవర గ్రామ పంచాయతీకి చెందిన జిందాల్ భూ నిర్వాసితులు పంచాయతీ కార్యదర్శి బంగారునాయుడుకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ జరగకుండా, గ్రామ సభ తీర్మనాలు లేకుండా 2023లో ఇచ్చిన జిఒ యంయస్14 ద్వారా ఏర్పాటు చేయబోతున్న ఎంఎస్ఎంఇ పార్క్‌లకు వ్యతిరేకంగా గ్రామ సభ నిర్వహించామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం, 1994లో సెక్షన్ 32 ప్రకారం, ప్రజారోగ్యం, ప్రజల శ్రేయస్సుకు జరిగే హాని దృష్ట్యా సర్పంచ్ గ్రామ సభ నిర్వహించని సందర్భంలో ఎగ్జిక్యూటివ్ అథారిటీ అయిన పంచాయతీ కార్యదర్శికు గ్రామ సభ నిర్వహించే అధికారం మాత్రమే కాకుండా బాధ్యత కూడా ఉందన్నారు. తక్షణమే గ్రామ సభ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

18 ఏళ్ల తర్వాత గుర్తొచ్చిందా?

జిందాల్ కంపెనీకి బలవంతంగా భూములు ఇప్పించిన 18 ఏళ్ల తర్వాత ఈ ప్రాంత ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం జరిగిందని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుకు గుర్తుకు వచ్చిందా అని ఆదివాసి గిరిజన సంఘం నాయకుడు జరత గౌరీష్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిందాల్ అల్యూమినియం కర్మాగారం నిర్మాణానికి భూ సేకరణ కోసం 2006వ సంవత్సరంలో బొడ్డవరం వద్ద నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో కంపెనీకి తమ భూములు ఇవ్వమని చెప్పినా అప్పుడు బలవంతంగా పోలీసులను పెట్టి భూములను లాక్కుని ఇప్పుడు మళ్లీ రైతుల పక్క మాట్లాడుతున్నట్లు నటించడం వాస్తవం కాదా అన్ని అన్నారు. వాళ్ల స్వార్థ రాజకీయ కుమ్ములాటలో అమాయక ప్రజలు బలైపోతున్నారని చెప్పారు.

పంచాయతీ కార్యదర్శికి వినతినిస్తున్న నిర్వాసితులు

రేబిస్ ప్రాణాంతక వైరస్

ప్రజాశక్తి - వేపాడ

రేబిస్ అనేది ప్రాణాంతక వైరస్ అని వేపాడ పశు వైద్యాధికారి కోరాడ గాయత్రి అన్నారు. ఈ నెల 28న వరల్డ్ రేబిస్ డే సందర్భంగా ఆమె శనివారం విలేకర్లతో మాట్లాడారు. రేబిస్ డే సందర్భంగా ప్రజల్లో అవగాహన పెంచుతామన్నారు. రేబిస్ సోకిన జంతువుల కాటు, గీతల ద్వారా ఇతరులకు వ్యాపిస్తుందన్నారు. ఇది కేంద్ర నాడీ వ్యవస్థపై దాడి చేసి చివరికి ప్రాణాలకు ముప్పు కలిగిస్తుందన్నారు. ఈ వైరస్ ప్రధానంగా సోకిన జంతువుల లాలా జలంలో ఉంటుందని, ఆ జంతువు ఇతరలను కరవడం, గీరడం ద్వారా మనుషులకు వ్యాపిస్తుందని అన్నారు. రేబిస్ సోకిన వారికి మొదట ఫ్లూ లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. జ్వరం, అనారోగ్యంగా అనిపించడం, కాటు, గీతల చోట తిమ్మిరి రావడం మొదటి సూచనలని చెప్పారు. తర్వాత గందరగోళం, మతి మరుపు, భ్రాంతి, మింగడంలో ఇబ్బంది, పక్షవాతం వంటి తీవ్రమైన సమస్యలు వస్తాయన్నారు. కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని సోకిన జంతువులను తాకకూడదని చెప్పారు. రేబిస్ సోకిన జంతువు కరిచినా, గీరినా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలన్నారు. గాయాన్ని శుభ్రపరచి, వైద్యుల సూచనల ప్రకారం రేబిస్ టీకా, అవసరమైతే ఇమ్యునోగ్లోబులిన్ తీసుకోవాలన్నారు. అలా చేస్తే వ్యాధిని నిరోధించవచ్చునని ఆమె తెలిపారు.

వారికి ఇంటి వద్దే రేషన్

ప్రజాశక్తి- రేగిడి

గ్రామాల్లో వృద్ధులు, బెడ్ రెస్ట్, నడవలేని వికలాంగులకు ఇంటి వద్దకే వెళ్లి డీలర్లు రేషన్ సరుకులు పంపిణీ చేయాలని తహశీల్దార్ ఐ.కృష్ణలత, సిఎస్‌డిటి ఈశ్వరరావు సూచించారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో డీలర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రేషన్ సరుకుల తూనికలు, కొలతలలో తేడాలు వస్తే ఉపేక్షించేది లేదన్నారు. లబ్ధిదారునికి ప్రభుత్వం నిబంధన ప్రాప్తికి సరుకులు అందజేయాలన్నారు. ప్రతినెల విధిగా ఇతర సరుకులకు డీడీలు కట్టాలన్నారు. సమయాలకు రేషన్ డిపోలు తీసి సరుకులు విధిగా ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో రేషన్ డిపో సంఘ నాయకులు, డీలర్లు పాల్గొన్నారు.

భోగాపురం: మండలంలోని రేషన్ షాపు డీలర్లతో తహశీల్దార్ ఎం.రవణమ్మ తన కార్యాలయంలో శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలకు అనుగుణంగా ప్రతి లబ్ధిదారుకూ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. స్మార్ట్ రైస్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని త్వరితగతిన పూర్తి చేసి, ఎవరూ ఇబ్బందులు పడకుండా చూడాలని సూచించారు. ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని డీలర్లు పారదర్శకంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన ఉపేక్షించేది లేదని ఆమె హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఎస్‌డిటి మురళి పాల్గొన్నారు.

పశుమాంసం అమ్మకాలపై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

విజయనగరం కంటోన్మెంట్ నుంచి పశు మాంసం తీసుకువచ్చి గ్రామాల్లో అమ్ముతున్న కసాయి వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమైక్య రాష్ట్ర కార్యదర్శి కేదార శెట్టి సత్యనారాయణ కోరారు. శనివారం స్థానిక తహశీల్దార్ శ్రీకాంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని ఎస్‌సి వీధుల్లోకి కంటోన్మెంట్‌కి చెందిన వారు వచ్చి నల్ల సంచుల్లో అరకేజీ, కేజీ ఆవు మాంసం అమ్మకాలు సాగిస్తున్నారన్నారు. సారిపల్లి నుంచి పశువుల అక్రమ రవాణా, కబేళాలకు సాగుతున్నా కేసులు నమోదు చెయ్యకపోవడం మండల అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. జీవో నెంబర్ 44ను అనుసరించి ప్రతి మూడు నెలలకు ఒకసారి మండల జంతు సంక్షేమ కమిటీ సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా రెండు సంవత్సరాలుగా సమావేశం జరగడం లేదన్నారు.

తక్షణం కమిటీ సమావేశం ఏర్పాటు చేయాలని, లేని పక్షంలో మండల అధికారుల అలసత్వం పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల గో సంరక్షణ కమిటీ అధ్యక్షులు భీమపల్లి సంధ్యారాణి, కార్యదర్శి సారిక రేణుక, పొట్నూరు రమణమ్మ పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, undersigned **ODEDARA RUKSANA GULAM MOHAMMAD** (Old Name). Address :- Arundathi Nagar, Beside Patnaik Blood Bank and Hospital, Vizianagaram, Cantonment, Vizianagaram, po: Ayyannapeta, Dist : Vizianagram, Andhra pradesh -53003. My name from **ODEDARA RUKSANA GULAM MOHAMMAD** (Old Name) to **RUKSANA GULAM MOHAMMAD** - (New Name) shall hence forth I am being called as **RUKSANA GULAM MOHAMMAD** (New Name)

మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారి దివ్యసముఖమునకు.
S.O.P. 01/2025

బిట్వీన్:
1. ధర్మవరపు రవణమ్మ (డైడ్)
2. ధర్మవరపు ప్రసాద్
3. ధర్మవరపు రమేష్ .....పిటిషనర్స్

ఎండ్ :
1. జిల్లా కలెక్టర్ విజయనగరం
2. మండల తహశీల్దార్ బొబ్బిలి .....రెస్పాండెంటు

జనరల్ పబ్లిక్ నోటీస్

యిందలి పిటిషనర్లు బొబ్బిలి మండలం, బొబ్బిలి గ్రామానికి చెందిన ధర్మవరపు అప్పలకొండ క్లాస్-1 ముఖ్య వారసులమనిన్నూ సదరు ధర్మవరపు అప్పలకొండ కాలం చేసిన నాటికి ఒ.ఎస్. నెం. 82/11 అను దావా డిక్రీ అయి వున్నది. సదరు డిక్రి బాకీ రావలసియున్న సదరు పిటిషనర్లు మహారాజశ్రీ బొబ్బిలి సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో S.O.P.01/2025 పిటిషను దాఖలు చేసి, సదరు ధర్మవరపు అప్పలకొండ తాలూకా వారసులకు సక్సెషన్ సర్టిఫికేట్ కోరే నిమిత్తం, సదరు పిటిషను దాఖలు చేసియున్నాము. సదరు క్లైము మొత్తం పొందుటకు పిటిషనర్లు మాత్రమే ముఖ్య వారసులమని వారసత్వ సర్టిఫికేట్ (సక్ససన్ సర్టిఫికేట్) కోరుతూ పై కోర్టులో పై పిటిషను దాఖలు చేసినందున శ్రీకోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం యీపత్రికా ప్రకటన మూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా సదరు పిటిషను పై ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు ఉన్న యెడల **తేది 09-10-2025న ఉ॥ 10.30 గం॥లకు** స్వయంగా లేదా వకీలు ద్వారా పై కోర్టులో హాజరై తెలియపరచుకొనవచ్చును. లేని యెడల పిటిషనరు ముఖ్య వారసులమని నిర్ణయింపబడును.

పై కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం.

బొబ్బిలి.
తేది26-09-2025.

కండాపు ప్రసాదరావు
పిటిషనరు తరుపు వకీలు
బొబ్బిలి.